మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

కట్టంగూర్, మే 20 : మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదుగాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామంలో ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సాయంలో స్వబాగ్స్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటు చేసిన స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ కో ఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. మహిళా సంఘాలకు ఒప్పంద పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌరశక్తి వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి చేసి ఆదాయం సంపాదించేందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా అయిటిపాములలో మహిళా సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ మహిళలు సోలార్ విద్యుత్ యూనిట్ల ద్వారా నెలకు రూ.2వేల ఆదాయం పంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీఓ యారాల అశోక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్ రావు, ఏపీఓ కడెం రామ్మోహన్, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, మాజీ ఎంపీపీ లింగస్వామి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనాన్ని త్వరగా ప్రారంభించాలి

- ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

వైద్యాధికారి అరవింద్‌ను అడిగి ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు, మే 20 : మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని 15 రోజుల్లోగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించి ప్రమాదానికి కారణాలు, నష్టం వివరాలను వైద్యాధికారి డాక్టర్ అరవింద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్త భవనాన్ని సందర్శించి పనుల తీరుపై అధికారులు, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కొత్త భవనం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అప్పగించాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, డాక్టర్ రఫీ, నాయకులు యడవల్లి వల్లభ్‌రెడ్డి, ముంగి శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

దేవరకొండ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బాలూనాయక్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

చందంపేట(దేవరకొండ), మే 20 : దేవరకొండ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని 12,13,14 వార్డుల్లో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని తాడూరి నర్సయ్య దుకాణం నుంచి గాంధీ బజార్ వరకు రూ.70లక్షలతో, డీఎన్‌టీ హాస్టల్ నుంచి ముత్యాలమ్మ బజార్ వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయా వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గీత వృత్తిదారులకు కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జమునా మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్ నాయక్, రాహత్‌అలీ, మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్, ఏఈ రాజు, మాజీ కౌన్సిలర్లు యూనుస్, వెంకటేశ్వర్లు, సైదులు, శ్రీను, జయప్రకాశ్ పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బీఎల్ఆర్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 20: పట్టణంలోని గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం గ్రంథాలయ ఉద్యోగి లక్ష్మీ నరసింహారెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పైడిమర్రి నరసింహారావు, డాక్టర్ రాజుల సహకారంతో గ్రంథాలయంలో మూడో అంతస్తు నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

స్నేహ పూర్వక వాతావరణంలో బోధనాభ్యసనం జరుగాలి

- ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణలో అధ్యాపకులు

మల్లికార్జునాచారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామగిరి, మే 20: స్నేహ పూర్వక వాతావరణంలో బోధనాభ్యసన ప్రక్రియ జరగాలని, అప్పుడే తెలుగు భాషపై విద్యార్థుల్లో మమకారం పెరిగి భాషపై పట్టు సాధిస్తారని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు చింతోజు మల్లికార్జునాచారి, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు తండు కృష్ణకౌండిన్య, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.రఘురామరాజు సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయులకు నల్లగొండలోని డైట్‌లో మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించే వృత్యంతర శిక్షణలో వారు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు సమాజంతోపాటు పాఠ్యంశాల్లో వచ్చే మార్పులకు అనుగుణంగా సరికొత్త బోధనోపకారణాలతో విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్యంశాలను బోధించాలని కోరారు. డీఈఓ భిక్షపతి మాట్లాడారు. కార్యక్రమంలో కోర్సు ఇన్‌చార్జి ఆర్.రామచంద్రయ్య, సబ్జెక్ట్ ఇన్‌చార్జీలు సాగర్ల సత్తయ్య, విజయలక్ష్మి, కనకటి రామకృష్ణ, కొప్పుల యాదయ్య, గ్యార నరసింహ, పొడిచేటి శంకర్, కె.కిషన్, మద్దోజు సుధీర్‌బాబు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FOR RENT
shutter with open land for rent, 380Sqyd, 1st lane, Raghavendra Colony, New Vision School back side, Nalgonda. Good for godowns Contact: 8008987068. NLG

INDUSIND BANK
COMMERCIAL VEHICLE FOR SALE
1.TATA SIGNA 4825/68 BS6 GOODS CABIN CHASSIS 2021, MODEL TS29TB1088 Deal no:AVK01828D
2.BHARATBENZ 5428 TS 4X2 3600 E6 SLC CHS2023 MODEL TS29TB5399 Deal no:AVK02010D
Cell No. 7337351819
D No.797, 1st Floor, Bharath Reddy Complex, Opp: MRO Office, Main Road, Kodad-508206

ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయినది
కౌసర్ జహన్, W/o. మొహమ్మద్ అబ్దుల్ రశీద్, R/o.H.No.10-5-166, దకిని బీడ్, గిర్మజీపేట్, వరంగల్(జి). నాకు చెందిన ఓపెన్ ప్లాట్ నెం.741, 742 యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంట్స్(Nos:9633/2018 and 19467/2018) నల్లగొండ టౌన్ ప్రకాశం బజార్‌లోని జిరాక్స్ సెంటర్‌కి వెళ్తుండగా పోయినవి దొరికినవారు సంప్రదించగలరు. సెల్:8121310963.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

కట్టంగూర్ : నిరసన కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామగిరి, మే 20: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికుక వ్యతిరేక విధానాలను విడనాడాలని, కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. కార్మికులు, సీఐటీయూ నాయకులు నల్లజెండాలు, ప్లకార్డులు చేతబూని బైక్‌ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న సుభాశ్‌చంద్రబోస్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకులంగా మారిందన్నారు. హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కార్మికుడికి కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు ఆవుల రవీందర్, అద్దంకి నరసింహ, సలవోజు సైదాచారి, గంజి నాగరాజు, ఆంజనేయులు, యాదగిరిరెడ్డి, చంద్రశేఖర్, పరమేశ్‌కొత్త, లింగస్వామి పాల్గొన్నారు.

కార్మికులకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి సంఘీభావం

కట్టంగూర్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు, మండల కన్వీనర్ పొడిచేటి సులోచన, నాయకులు లింగయ్య, కత్తుల శంకర్, పల్స యాదయ్య, తవిటి వెంకటమ్మ, చౌగోని ధనలక్ష్మి, భూపతి రేణుక, జానకి పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

చిట్యాల : కేంద్ర ప్రభు త్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చిట్యాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ అవిశెట్టి శంకరయ్య, నాయకులు అరూరి శ్రీను, జడల నర్సింహ, అండాలు, నర్సింహ, కార్మికులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : అప్పాజీపేటలో నిరసన తెలుపుతున్న కూలీలు

నల్లగొండలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

విత్తన డీలర్లకు ఈ పాస్ యంత్రాల పంపిణీ

డీలర్లకు ఈ పాస్ యంత్రాలు అందిస్తున్న ఏఓ జానిమియా

నకిరేకల్, మే 20 : నకిరేకల్, కేతేపల్లి మండలాల ఎరువుల డీలర్లకు కోరమాండల్ కంపెనీ సహకారంతో అధునాతనమైన ఈ పాస్ యంత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం మండలంలోని చందుపట్ల రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ఎండీ జానిమియా మాట్లాడుతూ 2015లో అందించిన యంత్రాల కంటే ప్రస్తుతం ఇచ్చేవి అధునాతనమైనవని, డీలర్లు రైతుల ఆధార్‌తో పాటు వారికి విక్రయించిన ఎరువుల వివరాలను ఈ పాస్ యంత్రంలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేతేపల్లి ఏఓ బి.పురుశోత్తం, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు బి. సతీశ్, ఎం.నర్సిరెడ్డి, ఏఈఓ నాగరాజు, మోపిన్, ఆత్మ బీటీఎం విక్రమ్ సందీప్, డీలర్లు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు : ఏఓ

విత్తనాభివృద్ధి సంస్థలో విత్తనాల శాంపిల్‌ను పరిశీలిస్తున్న ఏఓ సైదానాయక్

మిర్యాలగూడ, మే 20 : వానాకాలం సీజన్ కోసం పచ్చి రొట్ట విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందుబాటులో ఉంచినట్లు ఏఓ సైదానాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని నందిపాడు గ్రామంలో గల తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థలో విత్తనాల శాంపిల్స్‌ను కలెక్ట్ చేసి ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పీఏసీఎస్‌లలో జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ 30 కేజీల బ్యాగ్ రూ.2137.5, జనుము 40 కేజీల బ్యాగ్ రూ.2,510, పిల్లిపెసర 20 కేజీల బ్యాగ్ రూ.2.055గా ఉన్నట్లు తెలిపారు. రైతులు తొలకరి వర్షాలు పడినప్పుడు పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకొని పూత దశలో లేదా 45 రోజుల్లో నేలలో కలియదున్ని వరి పంట వేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- డైట్ ప్రిన్సిపాల్ నరసింహ

శిక్షణలో మాట్లాడుతున్న నరసింహ

మిర్యాలగూడ, మే 20: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని వృత్యంతర శిక్షణ జిల్లా పరిశీలకుడు, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ అన్నారు. ఐదు రోజులపాటు ఉపాధ్యాయులకు నిర్వహించే వృత్యంతర శిక్షణ కార్యక్రమం మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో ఉపాధ్యాయులు బోధన విధానాన్ని మరింత మెరుగు పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ లావూరి బాలు, ఎమ్మార్పీలు సాగరయ్య, రఘు, గులాం అహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, అంబటి శ్రీను, మక్బూల్, తులసీరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక ఆదాయం

- వ్యవసాయ శాస్త్రవేత్తలు శివప్రసాద్, సంధ్యారాణి

మాట్లాడుతున్న శాస్త్రవేత్త శివప్రసాద్

త్రిపురారం, మే 20: రైతులు పంట మార్పిడి చేసి అధిక ఆదాయాన్ని పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.శివప్రసాద్, కె.సంధ్యారాణి సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని, అవసరం మేరకే రసాయనాలను వినియోగించుకోవాలన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని, సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ అంబటి రాము, విత్తనాభివృద్ధి సంస్థ అధికారి నసీమా, అభ్యుదయ రైతులు నాయిని సంతోష్, పుట్టల సైదులు, సంపత్, నరేశ్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

కొండమల్లేపల్లి, మే 20 : రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నంనేనిపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాకు నిధులు లేవని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అందాల పోటీలకు కోట్ల రూపాయలు ఖర్చు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గుమ్మికొండ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు శేఖరాచారి, శ్రీనివాస్, కల్లు చరణ్‌రెడ్డి, కత్తుల భిక్షమయ్య, కాటి మల్లయ్య పాల్గొన్నారు.

మారిన మిర్యాలగూడ మండల సబ్ స్టేషన్ల ఫోన్ నంబర్లు

మిర్యాలగూడ, మే 20 : మిర్యాలగూడ రూరల్ విద్యుత్ సబ్ స్టేషన్‌ల ఫోన్ నంబర్లు మారినట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అమర్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ రూరల్ ఏఈ సెక్షన్ ఫోన్ నంబర్ 8712469401, బి.అన్నారం సబ్ స్టేషన్ 8712469423, అవంతీపురం సబ్ స్టేషన్ 8712469424, తడకమళ్ల సబ్‌స్టేషన్ 8712469425, కొత్తగూడెం సబ్ స్టేషన్ 8712469426, వెంకటాద్రిపాలెం సబ్ స్టేషన్ 8712469427, ఊట్లపల్లి సబ్‌స్టేషన్ నంబర్ 8712469428గా మారినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు మారిన నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో 18 మంది డిబార్

రామగిరి, మే 20:ఎంజీయూ పరిధిలోని కళాశాలల్లో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో మంగళవారం ఉదయం జరిగిన 6వ సెమిస్టర్‌లో 9 మంది, మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 9 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా అధికారులు డిబార్ చేశారు. దేవరకొండ ఎంకేఆర్ కళాశాలలో ఇద్దరు, తిరుమలగిరిలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో ఒకరు, దేవరకొండ భవిత డిగ్రీ కళాశాలలో ఒకరు, హసిత ఉమెన్స్ డిగ్రీ కళాశాల మిర్యాలగూడలో ఒకరు, డీవీఎం బీఈడీ కళాశాలలో ఒకరు, సూర్యాపేటలోని రాకేశ్ బీఈడీ కళాశాలలో ముగ్గురు డిబార్ అయినట్లు సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు 6,140 మంది హా జరుకావాల్సి ఉండగా 5,737మంది హాజరుకాగా 394 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.551 మంది హాజరుకావాల్సి ఉండగా 3,151 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల్లో సూర్యాపేటలోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఆర్‌కేఎల్‌కే డిగ్రీ కళాశాలలో ఒకరు, భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళశాలలో ఒకరు, స్టాన్‌ఫర్డ్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, మిర్యాలగూడ హాసితా ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, నల్లగొండ సిద్దార్థ డిగ్రీ కళాశాలలో ఒకరు చొప్పున డిబార్ అయినట్లు సీఓఈ వెల్లడించారు.

దాడి కేసులో నిందితులకు జరిమానా

నిడమనూరు, మే 20 : పాత కక్షలతో వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులకు జరిమానా విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి టి. స్వప్న తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ అధికారి షేక్ అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం ఈశ్వర్‌నగర్‌కు చెందిన చందా శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ భూమి పక్కన భూములు ఉన్న కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కూన్‌రెడ్డి ప్రభాకర్‌రెడ్డితో బాట విషయమై వివాదం నెలకొంది. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని 2016 జూలై 5న సాయంత్రం వెకంట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డితో కలిసి శ్రీనివాసరెడ్డితో అకారణంగా తగాదా పడి కర్రలతో దాడిచేశారు. దాంతో అతడికి గాయాలయ్యాయి. శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు సుదర్శన్‌రెడ్డి అడ్డు రాగా ఆయనపై కూడా దాడి చేశారు. ఈ విషయమై శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి హాలియా ఎస్ఐ ఎ.వెంకటయ్య కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. మంగళవారం సాక్షులను విచారించిన జడ్జి నిందితులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా ఖరారు చేశారు. జరిమానా చెల్లించని పక్షంలో నెలరోజుల సాధారణ జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సాధన వాదనలు వినిపించారు.

శనగకుంట దారి ఆక్రమణపై తాసీల్దార్ విచారణ

నిడమనూరు, మే 20 : మండలంలోని ఎర్రబెల్లి పంచాయతీ పరిధిలోని శనగకుంటకు వెళ్లే దారి ఆక్రమణపై తాసీల్దార్ జంగాల కృష్ణయ్య మంగళవారం విచారణ నిర్వహించారు. శనగకుంటకు వెళ్లే దారి ఆక్రమణకు గురైనట్లు గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాసీల్దార్ సర్వే చేపట్టారు. చెరువుకు వెళ్లే దారి, అలుగును ఆక్రమించి సేద్యం చేసినట్లు గుర్తించారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ పేర్కొన్నారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్, గిర్దావర్ సందీప్, మండల సర్వేయర్ విజయ్‌కుమార్, నీటిపారుదల శాఖ ఏఈ ప్రవీణ్‌రాజు ఉన్నారు.

కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన

కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం, మే 20: మండల కేంద్రంలోని షోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులను మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠిని అభినందించారు. ఏప్రిల్ 27న అమికల్ స్పోర్ట్స్ అకాడమి, విజన్ అకాడమి నిర్వహించిన ఇండో–నేపాల్ ఆల్ స్టైల్స్ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చి హైరేంజ్ ఆఫ్ బుక్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ పొందారు. దాంతో తనను కలిసిన విద్యార్థులను కలెక్టర్ అభినందించి సర్టిఫికెట్లు అందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కోచ్ కందుల రమేశ్, విద్యార్థులు వేదన్, నిహాన్, దక్షిత్, జ్ఞానేశ్వర్, అభినవ్, తేజ, ఓంకారేశ్వర్, మీనాక్షి, నవ్య, లోక్షిత, అర్షిక, భవాని, వైష్ణవి, డింపుల్ ఉన్నారు.

దుర్గమ్మ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే భగత్ పరామర్శ

దుర్గమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

తిరుమలగిరి(సాగర్), మే 20: మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన మాతంగి కాశయ్య మాతృమూర్తి దుర్గమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మంగళవారం వారి ఇంటికి వెళ్లి దుర్గమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పిడిగం నాగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జానయ్య, నాయకులు పామోజు వెంకటాచారి, పొదిల శ్రీనివాస్, సురభి రాంబాబు, శంకర్, సందీప్ ఉన్నారు.

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి

అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మునుగోడు/చండూరు, మే 20 : జూన్‌లో నిర్వహించే వనమహోత్సవంలో నాటేందుకు మొక్కలు అవసరమని, నర్సరీల్లోని మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మునుగోడు మండలంలోని జమస్తాన్‌పల్లి, చండూరు మండలం కస్తాల గ్రామంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొక్కల పెంపకం, నర్సరీ నిర్వహణపై అవగాహన కల్పించారు. నర్సరీలో ఇచ్చిన టార్గెట్ ప్రకారం 100శాతం మొక్కలు ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఎంపీఓ స్వరూపారాణి, ఇన్‌చార్జి ఎంపీఓ నాగరాజు చండూరులో ఎంపీడీఓ బండారు యాదగిరి, ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'మ్యాథ్స్ ఫర్ ఆల్' పుస్తకావిష్కరణ

రామగిరి, మే 20: దేవరకొండ మోడల్ స్కూల్ గణిత ఉపాధ్యాయుడు చెరుకు నాగరాజు రచించిన 'మ్యాథ్స్ ఫర్ ఆల్ గణిత పుస్తకాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని పీఆర్‌టీయూ భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మోడల్ స్కూల్ టీచర్స్ నాయకులు సలీమ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

చందంపేట, మే 20 : దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల ప్రజల చిరకాల స్వప్నం ఎస్ఎల్‌బీసీ, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గన్నెర్లపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ 15వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలోని నేరేడుగొమ్ము, చందంపేట, పీఏపల్లి మండలాలకు మంజూరైన అంబా భవాని, పొగిళ్ల లిఫ్ట్, నంబాపురం ఇరిగేషన్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి డిండి ప్రాజెక్టు ద్వారా సాగు, తాగు నీటిని అందించాలన్నారు. వర్షాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా పంట పెట్టుబడి సాయాన్ని అందజేయాలన్నారు. ప్రజా పాలనలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, నాయకులు వెంగలయ్య, మారెడ్డి కృష్ణారెడ్డి, కాంతయ్య, విజయనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, మైనొద్దీన్, రామస్వామి, ఆంజనేయులు, ఉప్పునూతల వెంకటయ్య, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం పరిరక్షణకు ఉద్యమించాలి

- రైతుసంఘం నాయకుడు వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, మే 20: గ్రామీణ పేదలకు మేలు కలిగేలా ఉన్న ఉపాధిహామీ పథకాన్ని పరిరక్షించుకునేందుకు కూలీలు ఉద్యమించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తుంగపాడు గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో కలిసి కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనేక పోరాటాలతో సాధించుకున్న ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తుందన్నారు. కేంద్రం ఉపాధి హామీ పథకం కింద 365 రోజుల పనిదినాలు కల్పించాలని, పని ప్రదేశంలో టెంట్, తాగు నీరు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లు గౌతంరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేశ్, శరత్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య

మర్రిగూడ,మే 20 : ఎన్నికల సమయంలో ఆరోగ్య మిత్రలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జి ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ గత సంవత్సరం ఆరోగ్య మిత్రల సమ్మె సమయంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందిస్తూ ఆరోగ్య మిత్రలకు డాటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్‌ను కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కానీ నేటికీ హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరోసారి నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

తల్లిని హతమార్చిన కుమారుడికి జీవిత ఖైదు

రామగిరి, మే 20 : తల్లిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్ట్ మంగళవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. 2020లో గుడిపల్లి మండలం బాలాజీనగర్ తాండాకు చెందిన మెగావత్ బుజ్జిని ఆమె కుమారుడైన మున్నా రోకలిబండతో తలపై మోది హత్య చేశాడు. ఈ కేసులో విచారణ జరిపిన అప్పటి ఎస్ఐ గోపాలరావు. సీఐ పరశురాం ముద్దాయి పై సరియైన సాక్షాధారాలతో కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్ట్‌లో కేసు విచారణ చేపట్టగా ముద్దాయి మున్నాపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఎం. నాగరాజు అతడికి జీవిత ఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ వాణి, గుడిపల్లి ఎస్ఐ డి. నరసింహులును దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.